



జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| సోమవారం 16 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 287 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## గచ్చిబౌలిలో ఘనంగా ముగిసిన మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు

**ప్రపంచ కప్ అర్హత కోసం ఉత్కంఠభరిత మ్యాచ్‌లు – తెలంగాణ ఆతిథ్యంపై విదేశీ జట్ల ప్రశంసలు**






సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: హైదరాబాద్ నగరం మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలుస్తూ గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించిన మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు ఘనంగా ముగిశాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవానికి హాజరై పోటీలను ప్రారంభించగా ముగింపు కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ కప్ అర్హత కోసం నిర్వహించిన ఈ పోటీల్లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ దేశాల జట్లు పాల్గొని ఉత్కంఠభరిత మ్యాచ్‌లతో ప్రేక్షకులను అలరించాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గచ్చిబౌలి స్టేడియంలో ఆధునిక ఆస్ట్రోటర్ఫ్‌తో పాటు భద్రత, వసతి, రవాణా, వైద్య సదుపాయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. విదేశీ జట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక లైజన్ అధికారులను నియమించి అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ పోటీలకు రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ అజహరుద్దీన్ తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే ప్రత్యేక ముఖ్య కార్యదర్శులు జయేశ్ రంజన్, సవ్యసాచి ఘోష్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డీజీపీ శివధర్ రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సృజన తదితరులు పోటీలను వీక్షించారు. ట్రిపుల్ ఒలింపియన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ముకేశ్ కుమార్‌తో పాటు నిధి కుల్లర్, ఎండల సౌందర్య, ఇషా సింగ్, దీప్తి జీవన్ జీ, సత్తి గీత వంటి క్రీడా ప్రముఖులు పాల్గొని యువ క్రీడాకారులను ప్రోత్సహించారు. ప్రేక్షకుల స్పందన విశేషంగా కనిపించగా స్టేడియం క్రీడాభిమానులతో కళకళలాడింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి నేతృత్వంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, హాకీ ఇండియా ప్రతినిధులు, అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రతినిధుల సమన్వయంతో పోటీలు విజయవంతంగా నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. గచ్చిబౌలిలో జరిగిన ఈ మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫయింగ్ పోటీలు తెలంగాణ క్రీడా చరిత్రలో ఒక ముఖ్య మైలురాయిగా నిలిచాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## ఐదు రాష్ట్రాలకు మోగిన ఎన్నికల నగారా

సందేశం టైమ్స్ న్యూఢిల్లీ ప్రతినిధి 16 మార్చి 2026: దేశంలో మరోసారి ఎన్నికల వాతావరణం నెలకొంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం మరియు పుదుచ్చేరి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల సంఘం ప్రధానాధికారి మీడియా సమావేశంలో ఈ ఎన్నికల తేదీలను వెల్లడించారు. ఈ ప్రకటనతో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ దశలు రాష్ట్రాల వారీగా నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టామని, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు మరింత వేగం పొందనున్నాయి.

## రంజాన్ ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

**అన్ని మతాల ప్రజలు సోదరభావంతో కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి**






సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలకు చెందిన ప్రజలు కలిసికట్టుగా సోదరభావంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించుకోవాలని పిలుపునిచ్చారు. రంజాన్ మాసం ఒక పండుగ మాత్రమే కాకుండా విలువలను గుర్తు చేసే పవిత్ర కాలమని, ఈ నెల రోజుల పాటు ఆత్మశుద్ధితో పరులకు సహాయం చేయడం, సత్సంబంధాలను కొనసాగించడం రంజాన్ మాసం ప్రత్యేకత అని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి, షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుగా అవకాశం కల్పించామని, అలాగే క్రికెటర్ మహమ్మద్ సిరాజ్, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌లకు డీఎస్పీ ఉద్యోగాలతో పాటు రెండు కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అదేవిధంగా ఎనిమిది మంది మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ మత సామరస్యంతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారని, ప్రతి సంక్షేమ పథకంలో మైనారిటీలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం ప్రజలందరిదని, తాను కూడా మీ సోదరుడినేనని పేర్కొంటూ అందరూ కలిసి తెలంగాణ, హైదరాబాద్ నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈ నెల 22న రైతు భరోసా తొలి విడత నిధులు విడుదల

సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: రాష్ట్ర రైతులకు ఆర్థిక సహాయం అందించే రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. తొలి విడతలో భాగంగా రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్లను జమ చేయనున్నారు. అనంతరం రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లను విడుదల చేయనున్నారు. మూడో విడతగా ఏప్రిల్ నెలాఖరులోపు మిగిలిన రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మూడు విడతలుగా కలిపి రాష్ట్ర రైతుల ఖాతాల్లోకి సుమారు రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు చేరనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.300 కోట్ల పెట్టుబడులు



సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ మరియు స్థానిక కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సంస్థలు సంయుక్తంగా అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినట్లు ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సంస్థలు వచ్చే మూడేళ్లలో సుమారు రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ ఫేజ్–4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 250 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఈ రెండు సంస్థల సీఈఓలు పెట్టుబడులకు అంగీకరించినట్లు మంత్రి పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ మరియు స్పెషాలిటీ కెమికల్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతోందని, కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ మరియు కెమ్ తత్వల భాగస్వామ్యం రాష్ట్రంపై అంతర్జాతీయ కంపెనీలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ తయారీ జరగనుండగా ఔషధ పరిశోధనలు, జీవక్రియపై అధ్యయనాలు, రోగనిర్ధారణ పరీక్షలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, ఆర్గానిక్ ఎలక్ట్రో ల్యూమినిసెంట్ మెటీరియల్స్, సెమీకండక్టర్ రంగాల్లో విస్తృతంగా ఉపయోగపడనున్నాయని తెలిపారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, మౌలిక సదుపాయాలు మరియు ప్రభుత్వ ప్రోత్సాహక విధానాల కారణంగా జీనోమ్ వ్యాలీలో పెట్టుబడి పెట్టాలని కంపెనీలు నిర్ణయించుకున్నట్లు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ సీఈఓ క్లిఫ్ కాల్డ్‌వెల్, కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సీఈఓ డా. విశాల్ రాజ్‌పుత్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం: మధ్యప్రాచ్యంలో ముదురుతున్న ఉద్రిక్తతలు



హైదరాబాద్, సందేశం టైమ్స్, ప్రతినిధి: ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం తీవ్ర ప్రతీకార చర్యలతో విపత్కర పరిస్థితులకు దారితీస్తోంది, ఇరాన్ తన పొరుగు దేశమైన ఇజ్రాయెల్‌పై ఏకంగా 290 కంటే ఎక్కువ మిస్సైళ్లను మరియు 500 కంటే ఎక్కువ డ్రోన్లను ప్రయోగించి భారీ దాడులకు దిగడంతో ఈ ప్రాంతంలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. దీనికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్ మరియు అమెరికా సంయుక్త సైనిక బలగాలు ఇరాన్‌లోని కీలక మిలిటరీ లక్ష్యాలను మరియు వ్యూహాత్మక సేకరణలను లక్ష్యంగా చేసుకుని దాడులు ముమ్మరం చేశాయి, ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న బాహ్య ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. యుద్ధం కారణంగా ప్రాంతీయ రాజకీయాలు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతుండగా, పోప్ లియో వంటి అంతర్జాతీయ నేతలు తక్షణమే శాంతిని నెలకొల్పాలని విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ యుద్ధం ఆగే సూచనలు కనిపించడం లేదు, ప్రస్తుతానికి ఈ విపత్తు ప్రయాణం సామాన్య ప్రజల భద్రతను తీవ్ర ప్రమాదంలోకి నెట్టివేస్తోంది.

## గ్యాస్ సిలిండర్ బుకింగ్ మోసాలపై ఎస్పీ హెచ్చరిక



సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి 16 మార్చి 2026: గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. కేవైసీ అప్‌డేట్, సబ్సిడీ పేరుతో వచ్చే నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ వంటి గోప్య సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ కోసం అధికారిక యాప్‌లు లేదా గుర్తింపు పొందిన వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఎవరికైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి సైబర్ మోసాలను నివారించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.




# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫా పంపిణీ - ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి 16 మార్చి 2026: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం తరపున ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు (తోఫా) పంపిణీ కార్యక్రమం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణుల భక్తి, ఆచారాలను గౌరవిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రంజాన్ తోఫాలను అందజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ సమానంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రంజాన్ ఆశీర్వాదాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్, వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ముస్లిం సోదర సోదరీమణులు, నారాయణఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణకు విచ్చేసిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబకు ఘన స్వాగతం



సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు విచ్చేసిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబకు జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆల్కా లాంబ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను ఉత్సాహపరచడంతో పాటు స్థానిక సమస్యలపై చర్చలు జరిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు ఆత్మీయ స్వాగతం తెలిపారు.



# ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయింపుపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసిన ఆటో జేఏసీ

సందేశం టైమ్స్ పటాన్‌చేరు ప్రతినిధి 16 మార్చి 2026: పటాన్‌చేరు ప్రాంతంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కేటాయింపులు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ నాయకులు పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిశారు. రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే దస్తగిరి (చోటు) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగూడాల సాయిలు తదితరులు ఎమ్మెల్యేను కలిసి తమ డిమాండ్లను వివరించారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీలను నమ్మి రాష్ట్రంలోని సుమారు 30 లక్షల ఆటో కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చాయని తెలిపారు. అయితే రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని పేర్కొన్నారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కేటాయింపులు చేసి న్యాయం జరిగేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు.

# డాకూర్ జడ్‌పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ



సందేశం టైమ్స్ అందోల్ ప్రతినిధి 16 మార్చి 2026: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు సాయిబాబా, మురళీకృష్ణ, మనోహర్‌తో పాటు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్‌పీహెచ్‌ఎస్ డాకూర్ పాఠశాలలో చదివిన రోజులే తమ జీవితానికి పునాది అయ్యాయని, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలిసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు.

# గీతం యూనివర్సిటీలో సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ - నాలుగో రోజు విజయవంతం

## విపత్తు నిర్వహణ, అగ్నిమాపక రక్షణ చర్యలపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ





సందేశం టైమ్స్ హైదరాబాద్ ప్రతినిధి 16 మార్చి 2026: తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ కార్యక్రమం నాలుగో రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రాథమిక అగ్నిమాపక విధానాలు, రక్షణ చర్యలు, విపత్తు నిర్వహణ సూత్రాలపై విద్యార్థులకు ఉపన్యాసాలు అందించడంతో పాటు ప్రాయోగిక శిక్షణ కూడా నిర్వహించారు. పటాన్‌చేరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.వి. నాగేంద్రతో పాటు ఇతర అధికారులు బహుళ అంతస్తుల భవనాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులను ఎలా రక్షించాలి అనే విషయాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు. లాడర్లు, రోపులు, బ్రీతింగ్ అపరేటస్ సెట్లు, ఫైర్ ఫైటింగ్ పరికరాలు, పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ వినియోగం, పై అంతస్తుల్లో ఉన్న బాధితులను సురక్షితంగా కిందకు తీసుకురావడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో గీతం యూనివర్సిటీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, సమన్వయం, తక్షణ స్పందనపై అవగాహన పొందారు. యువతలో విపత్తు నిర్వహణపై అవగాహన పెంపొందించి అత్యవసర పరిస్థితులకు సిద్ధతను పెంచడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.



# మత సామరస్యానికి నిదర్శనంగా సంగారెడ్డిలో ఘనంగా ఇఫ్తార్ విందు

## మత సామరస్యానికి ప్రతీకగా రాష్ట్ర మంత్రుల సందేశం

సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి 16 మార్చి 2026: పవిత్ర రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ గ్రౌండ్‌లో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమని, ఉపవాసం ద్వారా ఆత్మశుద్ధి సాధించడంతో పాటు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన కాలనీల అభివృద్ధికి పెద్దపీట నందన్ పారడైజ్ కాలనీలో ఇంటింటికి స్వచ్ఛ జలాల పంపిణీ ప్రారంభం



సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి 16 మార్చి 2026: పటాన్‌చేరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చేరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని నందన్ పారడైజ్ కాలనీలో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా నూతన రిజర్వాయర్లు, సంపులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా మంచినీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు.



# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మన్నెం సీతారాంరెడ్డి ఎంపిక



సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి 16 మార్చి 2026: సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన మన్నెం సీతారాంరెడ్డి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ (AICS) జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమైంది. ప్రస్తుతం చిలుకూరు మండలం పాలే అన్నారం నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆయన హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 20 నుంచి 25 వరకు న్యూఢిల్లీ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మఠంపల్లి గ్రామ ప్రజలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, వాలీబాల్ క్రీడాకారులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాలే అన్నారం గ్రామ సర్పంచ్ మండవ జయమ్మ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం మన్నెం సీతారాంరెడ్డి తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా, అలాగే సూర్యాపేట జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2023 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. బాల్యం నుంచే చదువులో మరియు క్రీడల్లో ఆసక్తి కనబరిచిన ఆయన ఎంపిఎ పూర్తి చేసినప్పటికీ క్రీడలపై మక్కువతో 2003 డీఎస్సీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఓపెన్ కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. వాలీబాల్ క్రీడలో ప్లేయర్, కోచ్, రెఫరీగా సేవలందిస్తూ అనేక మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో దాతల సహకారంతో ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థులకు శిక్షణ అందిస్తూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

# కాన్షిరాం జయంతి సభకు భారీ కన్వాయ్‌తో బయలుదేరిన బీఎస్పీ నాయకులు




సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి 16 మార్చి 2026: మాన్య శ్రీ కాన్షిరాం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు సంగారెడ్డి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో రాయికోడ్ మండలం నుంచి భారీ కన్వాయ్‌తో కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ పేదవారికి కూడా రాజ్యాధికారం సాధ్యమని చూపించిన గొప్ప మహానుభావుడు కాన్షిరాం అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద వర్గాలకు శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ముఖ్యమంత్రులుగా ఎదగడానికి మార్గం చూపిన నాయకుడు కాన్షిరాం అని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి భారీ కన్వాయ్‌తో చౌటుప్పల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లాలోని మండల అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా సంగమేశ్వర్ గౌడ్ - గాయత్రి వివాహం

సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి 16 మార్చి 2026: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఖర్చల్ గ్రామానికి చెందిన గౌండ్ల నర్సింహా గౌడ్ కుమారుడు సంగమేశ్వర్ గౌడ్ మరియు మొగుడంపల్లి గ్రామానికి చెందిన గౌండ్ల శోభరణి, జగన్నాథ్ గౌడ్ దంపతుల కుమార్తె గాయత్రి వివాహం బృందావన్ కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పంచభూతాల సాక్షిగా జరిగిన ఈ వివాహ వేడుకకు బంధుమిత్రులు, వివిధ పార్టీల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, నూతన సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ అక్షింతలు వేసి ఆశీస్సులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అతిథులు పాల్గొని భోజన తాంబూలాలను స్వీకరించారు. రాయికోడ్ మండలంలో మంచి స్వభావం, స్నేహశీలిగా పేరుపొందిన సంగమేశ్వర్ గౌడ్ వివాహానికి స్నేహితులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో హాజరై వేడుకను ఆనందంగా జరుపుకున్నారు.

# మాజీ ఏపీవో గోదేశి శ్రీనివాసరావుకు ఘన సన్మానం



సందేశం టైమ్స్ అనంతగిరి ప్రతినిధి 16 మార్చి 2026: సుదీర్ఘకాలం నడిగూడెం,అనంతగిరి మండలంలో ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా సేవలందించి ఇటీవల బదిలీపై సూర్యాపేట డిఆర్డిఎ కార్యాలయానికి వెళ్లిన గోదేశి శ్రీనివాసరావును వాయిలసింగవరం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా గోదేశి శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గద్దె రఘు, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, గడ్డం వీరబాబు, బుర్రా నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



# కళ్యాణలక్ష్మి పథకం చెక్కుల పంపిణీ

సందేశం టైమ్స్ అనంతగిరి ప్రతినిధి 16 మార్చి 2026: కోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను కోదాడలోని తమ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కంటు వేణు, కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వాయిలసింగవరం గ్రామంలో ఉచిత కంటి సర్జరీ మెగా శిబిరం




సందేశం టైమ్స్ అనంతగిరి ప్రతినిధి 16 మార్చి 2026: స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు కోదాడ మరియు సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత కంటి సర్జరీ మెగా శిబిరం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ గద్దె రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు మరియు గ్రామ పంచాయితీ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గద్దె రఘు ప్రారంభించగా, గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో వాయిలసింగవరం మరియు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన 30 మందిని సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చారుగుండ్ల ప్రవీణ్ రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, వంగవీటి రంగారావు, కాళంగి వెంకటేశ్వర్లు, డోగుపర్తి హైమావతి, డోగుపర్తి శ్రీనివాసరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గద్దె శివరామకృష్ణ, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, దాములూరి మురళి, గుండ్లపల్లి వెంకన్న, బుర్రా నాగమల్లేశ్వరరావు తదితరులు



# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం

సందేశం టైమ్స్ అనంతగిరి ప్రతినిధి 16 మార్చి 2026: పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్లు మరియు గ్రామపంచాయతీ సిబ్బందిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మరియు వర్డ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు దేవులపల్లి నాగరాజు, 2వ వార్డు సభ్యురాలు బుర్ర భవాని, 1వ వార్డు సభ్యుడు వీరబోయిన నాగరాజు, 10వ వార్డు సభ్యురాలు కంటూ రమాదేవి, 9వ వార్డు సభ్యుడు దాసరి పుల్లయ్య, 7వ వార్డు సభ్యుడు బొడ్డుపల్లి ప్రవీణ్, 3వ వార్డు సభ్యుడు తమలపాకుల వెంకటేష్, 4వ వార్డు సభ్యుడు అమరబోయిన వంశీ తదితరులు పాల్గొని గ్రామపంచాయతీ సిబ్బందిని అభినందించారు. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# జాతీయ సమైక్యతా శిబిరానికి తారా కళాశాల విద్యార్థిని ఎంపిక




సందేశం టైమ్స్ సంగారెడ్డి ప్రతినిధి 16 మార్చి 2026: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్ కర్ణాటక విశ్వవిద్యాలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరానికి తారా కళాశాలకు చెందిన బి.ఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గీత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బయలుదేరిన 10 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని, అందులో తమ కళాశాల విద్యార్థిని గీత ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ శిబిరంలో వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, ఆచార వ్యవహారాలను తెలుసుకోవడంతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రదర్శిస్తూ మంచి గుర్తింపు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. యువతలో జాతీయ సమైక్యత, భిన్నత్వంలో ఏకత్వ భావన పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తమ కళాశాల విద్యార్థిని ఎంపిక చేసినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ చైర్మన్, వైస్ ఛాన్సలర్ కుమార్ సార్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు సార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## పటాన్‌చేరు టౌన్‌లో మహిళ అదృశ్యం



సందేశం టైమ్స్ పటాన్‌చేరు ప్రతినిధి 16 మార్చి 2026: పటాన్‌చేరు టౌన్‌లో ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. జేపీ కాలనీ రోడ్ నంబర్ 4కు చెందిన పద్మజ (39) ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఈ నెల 12న ఆమె కుమారుడు వసంత్ రెడ్డి ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తల్లి కనిపించకపోవడంతో స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. అనంతరం బంధువులకు సమాచారం ఇచ్చి వెతికినా ఫలితం లేకపోవడంతో పటాన్‌చేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రెండు కోట్లతో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం – పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్ పటాన్చెరు, మార్చి 16 : పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం మినీ ఫంక్షన్ హాలు నిర్మిస్తున్నట్లు పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చైతన్య నగర్ కాలనీలో రెండు కోట్ల రూపాయల వ్యయం estimate తో చేపడుతున్న మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల శంకుస్థాపన ఆదివారం ఉదయం ఆయన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ధరలో ఫంక్షన్ హాలు అందించడం లక్ష్యమని, ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రాధాన్యం అని తెలిపారు.




## కట్ట మైసమ్మ దేవాలయ జాతరలో పాల్గొన్న పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు (సందేశం టైమ్స్ బి.డేవిడ్) – రామచంద్రపురం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో గల శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన జాతర మహోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడినవి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన అన్నారు: అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యంతో జీవించాలనేది ప్రార్థన. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పాశమైలారం మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 16: ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరగే జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత, మాజీ జడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్, కౌన్సిలర్లు సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, చందు, రాజ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## మార్చి 17న ఇందిరాపార్క్ వద్ద గీత కార్మికుల మహాధర్నా – పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు

సంగారెడ్డి, మార్చి 16 (సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ఇన్చార్జి: కే. మ మల్లేశం గౌడ్) – తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2026–27లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5000 కోట్లు కేటాయించాలని, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.70 కోట్లను ఈ మార్చి నెలలోనే ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 17న ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్ ఇన్దిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు గీత కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కల్లోగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.సంగారెడ్డి ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.11 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని, గీత కార్మికుల పెన్షన్‌ను రూ.4000కు పెంచాలని, ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని ఈతా, తాటి చెట్ల పెంపకానికి కేటాయించాలని, నీరా కేఫ్‌లను ప్రారంభించి జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కార్మికుడికి జీవబీమా, కొత్త వారికి పెన్షన్ మంజూరు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడం వంటి హామీలను అమలు చేయాలని కోరారు.ఈ మహాధర్నాలో రాష్ట్రంలోని గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రవీందర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, మ Mallేశం గౌడ్, అశోక్ గౌడ్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ యాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్చెరులో ఈద్ తోఫాల పంపిణీ

సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 16: పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని వివిధ మసీదుల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ కానుకలను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ముస్లింల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేశారని. రంజాన్ పండుగ రోజున నిరుపేద ముస్లింలు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని లక్ష్యంగా కెసిఆర్ ప్రభుత్వం రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన అభిప్రాయపడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత నాయిన రెడ్డి మోహన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్



సందేశం టైమ్స్ జహీరాబాద్ మర్చి 16( సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ఇన్చార్జి కే మల్లేశం గౌడ్)ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాయిన రెడ్డి మోహన్ రెడ్డి గారి కుటుంబాన్ని జహీరాబాద్ ఎంపీ శ్రీ సురేష్ కుమార్ షెట్కార్ పరామర్శించారు. మోహన్ రెడ్డి గారి నివాసానికి వెళ్లిన ఎంపీ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి గారి కుమారుడికి మనోధైర్యం నింపుతూ, ఈ విషాద సమయంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మోహన్ రెడ్డి గారి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్ నారాయణఖేడ్ మర్చి 16( నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి టి చంద్రశేఖర్ )సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో ఉన్న కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్హేర్ మండలం నుంచి 40, నారాయణఖేడ్ నుంచి 87, కంగ్టి నుంచి 59, మానూర్ నుంచి 2, నగల్ గిద్ద నుంచి 1, సిర్గాపూర్ నుంచి 23 మందికి కలిపి మొత్తం 228 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పేదలకు పార్టీ భేదం లేకుండా అన్ని సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ముఖ్యంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు త్వరగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పథకాలు పేద కుటుంబాల పెళ్లి భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.